క్లుప్తంగా

పాలిసెట్ మోడల్ పరీక్షకు స్పందన



పాలిసెట్ మోడల్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

మునగపాక: మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆదివారం నిర్వహించిన పాలిసెట్ మోడల్ పరీక్షకు విశేష స్పందన లభించింది. స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షకు మునగపాకతో పాటు ఇతర మండలాలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. ఈ మోడల్ పరీక్షలో మెరుగైన మార్కులు సాధించిన విద్యార్థులకు సంస్థ ప్రతినిధులు మూర్తి, దుర్గా ప్రసాద్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా సత్తెమ్మతల్లి పండగ



సత్తెమ్మతల్లిని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక: మునగపాక నుంచి వాడ్రాపల్లికి వెళ్లే మార్గంలోని సత్తెమ్మతల్లి పండగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. వేసవికాలం కావడంతో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ తగు చర్యలు తీసుకుంది. ఈ మార్గం గుండా రాకపోకలు సాగించే పలు ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. తంపరమూల రైతు సంఘ అధ్యక్షుడు కాండ్రేగుల మణికంత, రైతులు కాండ్రేగుల లక్ష్మణరావు, మోహన్,గోవింద కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులకు పదిలో ఉత్తమ ఫలితాలు

అచ్యుతాపురం(అనకాపల్లి): టెన్త్ ఫలితాల్లో సర్కార్ బడులు మంచి ఫలితాలు సాధించాయి. అచ్యుతాపురం మండలంలోని కొండకర్ల ఉన్నత పాఠశాలలో 64 శాతం ఉత్తీర్ణత సాధించారు. అచ్యుతాపురం కేజీబీవీ విద్యార్థులు 86 శాతం, అచ్యుతాపురం హైస్కూల్‌లో 68 శాతం, దోసూరు హైస్కూల్‌లో 83 శాతం, హరిపాలెం ఉన్నత పాఠశాలలో 70 శాతం, మడుతూరు ఉన్నత పాఠశాలలో 88 శాతం, ఎం.జె.పురం ఉన్నత పాఠశాలలో 59 శాతం, ఖాజీపాలెం ఉన్నత పాఠశాలలో 64 శాతం, పూడిమడక 47 శాతం, పెదపాడు ఉన్నత పాఠశాలలో 59 శాతం ఉత్తీర్ణత సాధించారు.

ఏకాగ్రతతో చదువుకుంటే మంచి ఫలితాలు

మునగపాక: విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చని పాటిపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీ లక్ష్మి పేర్కొన్నారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మోడల్ స్కూల్‌కు చెందిన కాండ్రేగుల సౌజన్య 574 మార్కులు సాధించింది. దీంతో ఆదివారం సౌజన్యను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లక్ష్యం కోసం విద్యార్థులు ఇష్టపడి, కష్టపడి చదువుకోవాలన్నారు. మోడల్ స్కూల్లో 24 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారన్నారు. వారికి బోధన జరిపిన ఉపాధ్యాయులను కూడా ఆమె అభినందించారు.

మునగపాకలో 'గడప గడపకు' నేడు

మునగపాక: మునగపాకలో సోమవారం ఉదయం 6గంటల నుంచి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే రమణమూర్తిరాజు పాల్గొనే ఈ కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుంటారన్నారు. పార్టీ నేతలు, అధికారులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అచ్చియ్యనాయుడు కోరుతున్నారు.

నేటి నుంచి వేసవి శిబిరాలు

అచ్యుతాపురం(అనకాపల్లి): ఈ నెల 8 నుంచి జూన్ 11 వరకూ అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో వేసవి శిబిరం నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్ కోటేశ్వరరావు తెలిపారు. విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్, స్టోరీ రైటింగ్, రీడింగ్‌పై అవగాహన కల్పిస్తామని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

గడప గడపకూ సంక్షేమం..అభివృద్ధి

- రహదారులు, తాగునీరు, డ్రెయిన్ల సమస్యలు పరిష్కారం
- ప్రతి సచివాలయానికి రూ.20 లక్షల నిధులు కేటాయింపు
- నియోజకవర్గంలో 83 సచివాలయాలకు 72 సచివాలయాల్లో పూర్తి
- ప్రజల నుంచి విశేష స్పందన

మునగపాక: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడంతో ఒకవైపు సంక్షేమం మరో వైపు అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలు కూడా నెరవేరుతున్నాయన్న నమ్మకం ప్రజల్లో కనిపిస్తుంది. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రవేశపెట్టిన గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి.

ప్రజల్లో నమ్మకం కలిగిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం...

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజల్లో నమ్మకం పెరుగుతుంది. ఎమ్మెల్యే రమణమూర్తిరాజు ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకోవడంతో పాటు వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటున్నారు. అలాగే ప్రభుత్వం ద్వారా అందిన లబ్ధిని బుక్‌లెట్‌ల ద్వారా ప్రజలకు వివరిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా అక్కడికక్కడే నిధులు మంజూరు చేసేందుకు గాను ప్రతి సచివాలయానికి ప్రభుత్వం రూ.20 లక్షల మేర కేటాయింపులు చేసింది.



గడప గడపకు మన ప్రభుత్వ నిధులతో నిర్మించిన అరబుపాలెంకు వెళ్లే రోడ్డు

రాష్ట్ర వ్యాప్తంగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి గాను రూ.3వేల కోట్లను కేటాయించింది.

రహదారులు, మురుగుకాల్వల అభివృద్ధికి నిధుల కేటాయింపు...

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ధికారంలోకి వచ్చాక అభివృద్ధి శరవేగంగా జరుగుతుంది. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. విలేజ్ క్లినిక్‌లు, ఆర్బీకేలు, సచివాలయాలు ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు, రైతులకు మెరుగైన సేవలందిస్తున్నారు. ఇక గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా రూ.20 లక్షల మేర నిధులు కేటాయించడంతో సంబంధిత నిధులతో రహదారులు,డ్రెయిన్లు, తాగునీటి సదుపాయం తదితర సమస్యలు పరిష్కారం అవుతున్నాయి. నియోజకవర్గంలో 83 సచివాలయాలు ఉండగా ఇప్పటికే ఎమ్మెల్యే రమణమూర్తిరాజు 72 సచివాలయాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తి చేసి రాష్ట్రంలోనే గుర్తింపు పొందారు.

అభివృద్ధికి ఊతం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులకు అవకాశం ఉంది. ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి చేసుకునేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుంది. పంచాయతీలకు వచ్చే నిధులతో పాటు ఈ కార్యక్రమం ద్వారా వచ్చే అదనపు నిధులు అభివృద్ధికి దోహదం చేస్తాయి.

–దిమ్మల అప్పారావు, సర్పంచ్, మునగపాక

సకాలంలో సమస్యల పరిష్కారం



గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తుంది.ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి ఈ కార్యక్రమం వేదికగా నిలుస్తుంది. ఇంటింటికీ వెళ్లడం ద్వారా నాలుగేళ్ల కాలంలో ప్రభుత్వం నుంచి అందిన లబ్ధిని వివరించడంతో పాటు కొన్ని సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించగలుగుతున్నాం. ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు కేటాయించడం ద్వారా రహదారులు, డ్రైన్లు,తాగునీటి సమస్యలు పరిష్కారమవుతున్నాయి.

–యూవీ రమణమూర్తిరాజు, ఎమ్మెల్యే,యలమంచిలి

ప్రతి కార్యకర్త చిత్తశుద్ధితో పనిచేయాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న గోవిందరావు

ఎస్.రాయవరం: పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డిని మరోమారు సీఎంగా గెలిపించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి బొలిశెట్టి గోవిందరావు అన్నారు. ఉప్పరాపల్లి గ్రామంలో సచివాలయ కన్వీనర్ తుమ్మపాల వెంకటసత్యనారాయణ గృహ ప్రవేశానికి విచ్చేసిన గోవిందు స్థానిక సర్పంచ్‌లు, ఎంపీటీసీలు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. పార్టీ మూడున్నర ఏళ్ల కార్యకర్తలకు, నాయకులకు శ్రమ లేకుండా ఎటువంటి అవినీతి తావివ్వకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో సంక్షేమ పథకాలు అందజేశారన్నారు. మళ్లీ కార్యకర్తలంతా పని చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం నుంచి పొందిన సహాయం అందిన తీరును తెలుసుకుని సమస్యలు ఉంటే పరిష్కరించాలన్నారు. ప్రతి కార్యకర్త చిత్తశుద్ధితో గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఉప్పరాపల్లి సర్పంచ్ శానాపతి శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ మండలశాఖ అధ్యక్షులు కొణతాల శ్రీనివాసరావు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నీట్ ఎగ్జామ్



పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు

పాయకరావుపేట: స్థానిక శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల్లో ఆదివారం నీట్ ఎగ్జామ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం 11 గంటలకే జిల్లా నలుమూలల నుంచి శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల వద్దకు నీట్ ఎగ్జామ్ రాయడానికి విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కూడా పరీక్ష కేంద్రాల వద్దకు హాజరయ్యారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు నీట్ ఎగ్జామ్ జరిగింది. స్థానిక సీఐ పి.అప్పలరాజు ఆధ్వర్యంలో ఇద్దరు ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

వైభవంగా సత్తమ్మతల్లి జాతర



కలశ సారె ఆలయానికి తీసుకువస్తున్న భక్తులు



పూజలందుకున్న సత్తమ్మతల్లి అమ్మవారు

ఎస్.రాయవరం: గుర్రాజుపేట గ్రామంలో ఆదివారం శ్రీ సత్తమ్మతల్లి జాతర ఘనంగా నిర్వహించారు.గ్రామస్తులు వేకువ జాము నుంచి గ్రామ ముఖద్వారం వద్ద ఉన్న ఆలయానికి పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కుల చెల్లించుకున్నారు. ఆచార సంప్రదాయాలతో అమ్మవారికి కలశ సారె సమర్పించారు. చీరసారె, పసుపు కుంకుమలు సమర్పించడంలో పోటీపడ్డారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు అన్నసమారాధన జరిపారు. జాతరలో గుర్రాజుపేట ,కొరుప్రోలు, గుడివాడ, లక్ష్మీపతిరాజుపేట, పెదఉప్పలం గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

తోటాడలో ప్రత్యేక పారిశుధ్య చర్యలు

మునగపాక: తోటాడ పంచాయతీని ఆదర్శవంతంగా తయారు చేస్తామని సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు అన్నారు. పారిశుధ్యంతో పాటు కాలువల్లో పేరుకుపోయిన చెత్త తొలగింపు పనులను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్యం ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా శ్మశానవాటిక అభివృద్ధితో పాటు మురుగుకాలువల్లో పేరుకుపోతున్న సిల్టు తొలగింపునకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వార్డు సభ్యులు పీఎంఎల్ నాయుడు, రవి, వైఎస్సార్‌సీపీ నేత నరేంద్ర పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

యలమంచిలి: చలివేంద్రాలు వేసవి తాపం నుంచి ప్రజలకు ఉపశమనం కలిగిస్తాయని మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి అన్నారు. ఆదివారం యలమంచిలి పట్టణంలో రైల్వే స్టేషన్‌రోడ్డులో షేక్ సుభాన్ జ్ఞాపకార్థంగా వారి కుటుంబం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరావు, అర్రెపు గుప్తా, కొక్కిరాపల్లి పీఏసీఎస్ చైర్మన్ మళ్ల కొండబాబు, మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



చలివేంద్రం ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి

రక్తదాన శిబిరానికి స్పందన

ఎస్.రాయవరం: మనం సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో అడ్డురోడ్డులో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన వచ్చింది. తిమ్మాపురం, రామయ్యపట్నం, పెదగుమ్ములూరు, చినగుమ్ములూరు, బంగారమ్మపాలెం తదితర గ్రామాలకు చెందిన యువకులు 70 మంది వచ్చి రక్తదానం చేశారు. వారికి ట్రస్ట్ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.



రక్తదానం చేస్తున్న స్థానిక యువకులు

గౌరీపరమేశ్వరుల వార్షికోత్సవ ఏర్పాట్లు

అనకాపల్లిటౌన్ : స్థానిక వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. 14న 108 కలశాలతో అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, పూజలు, 15న గౌరీపరమేశ్వరుల కల్యాణోత్సవం, అన్నసమారాధనకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

'మోడల్'లో ప్రవేశానికి దరఖాస్తులు

నర్సీపట్నం: వేములపూడి ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.సంధ్యారాణి తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతిలో ప్రవేశానికి అర్హత కలిగిన విద్యార్థులు ఈ నెల 25వ తేదీ లోపు htt pr://a pm-r.a p,go-v.i n/a pmr వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. జూన్ 11వ తేదీన రాత పరీక్ష ఉంటుందన్నారు. ఆన్‌లైన్ అప్లికేషన్లు పాఠశాలల్లో అందజేయాలని సూచించారు.

నేడు గవరపేట దేవతమ్మ ఉత్సవం



కశింకోటలోని గవరపేటలో వెలసి ఉన్న దేవతమ్మ

కశింకోట : స్థానిక గవరపేటలో వెలసిన దేవతమ్మ ఉత్సవాన్ని పెద్ద ఎత్తున సోమవారం నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. రెండేళ్లకోసారి నిర్వహించే ఈ ఉత్సవంలో జిల్లాలోని వేగి ఇంటి పేరున్న వారితోపాటు, స్థానికులు ఉత్సాహంగా పాల్గొంటారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఉదయం సిద్ధుల వేషం, అనంతరం పంచ రంగులతో చక్రాకారంలో వేసే ముగ్గు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. దీన్ని వేగి కుటుంబీకులు సంప్రదాయంగా పెడతారు. తర్వాత అమ్మవారిని ఊరేగించి శారదానదిలో నిమజ్జనం చేయడంతో ఉత్సవం ముగుస్తుంది. ఉత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవంలో భాగంగా ఆదివారం సంప్రదాయంగా మేకను జోల పాట పాడి నిద్రింపజేశారు. స్థానికులు ఆసక్తిగా తిలకించారు. అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ దృష్టికి ఉపాధ్యాయ సమస్యలు

నర్సీపట్నం: రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణా మండలి (ఎస్‌సీఈఆర్టీ) డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డిని పీఆర్టీయూ ఉపాధ్యాయులు సన్మానించారు. ఆదివారం నర్సీపట్నం విచ్చేసిన ఆయన్ను పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపినాథ్, జి.వి.రమేష్, అల్లు అప్పారావు, బాబి తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

ఘనంగా పైడితల్లమ్మ ఆలయ ప్రారంభోత్సవం

కె.కోటపాడు: పిండ్రంగి గ్రామంలో నూతన పైడితల్లమ్మ అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని నిర్వహించారు. గ్రామస్తులతోపాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

అంబేడ్కర్ అందరివాడు



బోదిగల్లంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నక్కపల్లి: భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్ అందరి వాడని, ఆ మహనీయున్ని ఒక వర్గానికి పరిమితం చేయడం తగదని కాపు కార్పొరేషన్ డైరక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ అన్నారు. ఆదివారం పెద బోదిగల్లంలో దళితులు ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం వల్ల భారతదేశంలో నివసిస్తున్న అన్ని వర్గాల వారు లబ్ధి పొందారన్నారు. సంక్షేమ ఫలాలు అన్ని వర్గాల వారికి అందుతున్నాయని, అది అంబేడ్కర్ మహనీయుడి పుణ్యమేనన్నారు. ఇటువంటి మహోన్నత వ్యక్తిని కేవలం ఒక వర్గానికి పరిమితం చేయడం సమంజసం కాదన్నారు. కులమతాలకు అతీతంగా సర్వ మానవ సౌభ్రాతృత్వం, అణగారిన వర్గాల అభ్యున్నతికి పీడిత వర్గాల బాగు కోసం పాటుపడిన వ్యక్తిగా పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మున్సీసా, ఎంపీటీసీ గొర్ల గోవిందు, దళిత నాయకులు, మాజీ సర్పంచ్ యాదాలశ్రీను, స్థానిక నాయకులు అడ్డూరి అప్పారావు, కనికళ్ల కృష్ణ పాల్గొన్నారు.

అల్లూరి, సుందరయ్యలకు ఘన నివాళులు



అల్లూరి, సుందరయ్య చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



చినదొడ్డిగల్లులో అల్లూరికి నివాళులర్పిస్తున్న దృశ్యం



గుడివాడలో అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

మునగపాక: ప్రతి ఒక్కరూ అల్లూరి, సుందరయ్యల ఆశయ సాధనకు పాటుపడాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు కోరారు. మండలంలోని గవర్ల అనకాపల్లిలో ఆదివారం అల్లూరి శత వర్ధంతి, సుందరయ్య 110వ జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. వారి చిత్రపటాల వద్ద పుష్పగుచ్ఛాలు వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్య్ర ఉద్యమంలో పీడిత ప్రజల తరపున పాల్గొని సేవలందించారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు, సీపీఎం నేత ఆళ్ల మహేశ్వరరావు, గ్రామస్తులు దాడి శ్రీనివాసరావు, రమణబాబు, నాగేశ్వరరావు, నరేంద్రకుమార్, రాము, పెంటకోట జోగినాయుడు, ఆళ్ల సూరిబాబు, దొడ్డి అప్పారావు పాల్గొన్నారు.

అల్లూరికి ఘన నివాళి

నక్కపల్లి: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని ఆదివారం చినదొడ్డిగల్లు శాఖాగ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. లైబ్రేరియన్ కె.జనార్దన్ ఆధ్వర్యంలో అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి స్వాతంత్య్రం తీసుకురావడం కోసం అల్లూరి ప్రాణాలర్పించాడన్నారు. ఆ మహనీయుని ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

ఎస్.రాయవరం: మన్యం వీరుడు అల్లూరి వర్ధంతిని గుడివాడ, గుర్రాజుపేట, పి.ధర్మవరం, ఆర్‌వీ నగర్‌లో ఆదివారం నిర్వహించారు. చిన్న వయసులోనే ప్రజాసేవకు అంకితమై దేశ స్వాతంత్య్ర సంగ్రామంలో ప్రాణాలు వదిలిన మహావీరుడు అల్లూరి సీతారామరాజు అని ప్రముఖ లాయర్ దూళి నూకరాజు అన్నారు. ఆయా గ్రామాల్లో అల్లూరి విగ్రహాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

దేవీపురం క్షేత్రంలో ప్రత్యేక పూజలు



అమ్మవారిని పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్కాపురంలోని జనతాకాలనీలో జయదుర్గ పీఠాన్ని గురూజీ అమృతానంద స్వామీజీ 20 సంవత్సరాల కిందట స్థాపించారు. నాటి నుంచి ఏటా మే 7వ తేదీన అక్కడి భక్తులు జయదుర్గా అమ్మవారిని ఊరేగింపుగా దేవీపురంలోని పుట్టింటికి తీసుకురావడం ఆనవాయితీగా జరుగుతుంది. దీనిలో భాగంగా మరియ దాసు,ఆడారి అప్పారావు తదితరులు కమిటీ తరపున వచ్చి అమ్మవారికి క్షీరాభిషేకం,షోడశోపచార పూజ,లలితా సహస్ర నామ పారాయణం చేయించారు. ఇటు వంటి కార్యక్రమాలు మంచి పరిణామానికి దారితీయడమే కాకుండా ప్రపంచ శాంతికి దారితీస్తాయని గురుమాత అన్నపూర్ణమ్మ తెలిపారు. సాయంత్రం మళ్లీ జయదుర్గా అమ్మవారిని పల్లకీలో ఊరేగింపుగా మల్కాపురంలోని జనతా కాలనీకి తీసుకువెళ్లారు.

దుర్గాదేవి సారె ఊరేగింపు

అనకాపల్లిటౌన్ : స్థానిక రజకవీధి దుర్గాదేవి ఆలయ 8వ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం సాయంత్రం అమ్మవారి సారె ఊరేగింపు నేత్రపర్వంగా సాగింది. పలు రకాల పిండివంటలు, మిఠాయిలు, అరటిపళ్లు, పసుపు, కుంకుమలను మహిళలంతా తలపై మోసుకుని ఊరేగించారు. పురవీధుల గుండా అమ్మవారి ఆలయానికి చేరుకుని సారెను అమ్మవారికి నివేదించారు. వార్షికోత్సవ కార్యక్రమాలు సోమవారం ఉదయం నుంచి ప్రారంభంకానున్నాయి.